పాతివ్రత్యం

మల్లంపల్లి కృష్ణారావు

మదనమంజరి అద్దంముందు కూర్చుని అలంకరించుకోసాగింది. అలంకరించుకోవడంకూడా గొప్ప కళే. అండలోనూ మంజరి వంటి అపురూప సౌందర్యవంతులకు అలంకరణ సాధారణంగా వుంటే అందం ముందు అలంకరణ

వెలవెలబోయే ప్రమాదం వుంది. పైగా వేశ్యావృత్తిలో జీవిస్తూన్నందువల్ల విటులకు నిత్యనూతనంగా పెంపొందే యౌవనవతిగా కనిపించాలంటే అలంకరణలో లోపం వుండకూడదు. అందుకే మంజరి అతి శ్రద్ధగా అలంకరించుకుంటుంది. కాశ్మీరం నుంచి ప్రత్యేకంగా కస్తూరి తెప్పించింది. వింధ్యారణ్యాలలో వేటాడి సంపాదించిన పున్నాగ పరిమళ ద్రవ్యాలకు మోజుపడి అధిక వెలతో వాటిని కొన్నది. ప్రఖ్యాతి వహించిన విశ్వబ్రాహ్మణుల చేత వజ్రవైఢూర్యాలతో, పగడాలతో, నీలాలతో, ముత్యాలతో ఎన్నో ఆభరణాలు చేయించింది. కంచీపురం, కాశ్మీరపురం, వరపురం పట్టు చీరలు తెప్పించింది. ముత్యాలభస్మంతో పారాణి చేయించింది. అంతేకాదు. తన చెలికత్తె సుభాషిణిని ఉజ్జయినీ విశ్వవిద్యాలయానికి పంపి అలంకరణ శాస్త్రంలో ప్రత్యేకశిక్షణ ఇప్పించింది.

"మరకతాలు పొదిగిన ఈ హంసల హారం ధరిస్తారా?" అనడిగింది సుభాషిణి.

"వద్దు. వజ్రాలహారమే బాగుంటుంది. ఈ నీలంరంగు కాశ్మీరపు చీరకు ఆ హారమే అందాన్నిస్తుంది" అంది మంజరి.

సుభాషిణి సిగ్గుపడుతూ నవ్వింది. అలంకరణ విషయంలో తను ఉజ్జయినీలో పొందిన శిక్షణకన్న మంజరికున్న అనుభవం, సూక్ష్మబుద్ధి అమోఘమైనవని తెలుసు.

"ఈ రోజు ఇంత ప్రత్యేకంగా అలంకరించుకొంటున్నారు! విషయం తెలుసుకోవచ్చా?" పాదాలకు పారాణి రాస్తూ అడిగింది సుభాషిణి.

"విదర్భదేశపు యువరాజు వచ్చారు. తిరిగి రేపు వారిదేశం వెళ్ళిపోతారుట. ఈరోజు వారి సమ్ముఖంలో నాట్యం చేయాలి," నవ్వుతూ సమాధానమిచ్చింది మంజరి.

మంజరి నవ్వులోని అంతర్భావం సుభాషిణికి అవగతమే. తిరిగి యువరాజు వెళ్ళేది ఒక పక్షం తర్వాతనే. మంజరి అందచందాల మహత్యం అలాంటిది.

"విదర్భ యువరాజు ఈ రాత్రికి మన భవనం వేంచేస్తారు. భవనం బాగా అలంకరించారా?" మంజరి అడిగింది.

"వేరే అలంకరించాలా, అమ్మా? మన భవనం ఎప్పుడూ నూతనమే! మీరే వచ్చి పరికించండి," అంది సుభాషిణి.

మంజరి అద్దంముందు నుంచి లేచి జరీ అంచుతోవున్న వంగ పండు రంగు కాశ్మీరపు శాలువా కప్పుకుంది. భవనాన్ని పరిశీలించడానికి బయలుదేరింది.

నాట్యప్రదేశాన్ని రంగు రంగుల ముగ్గులతో చూడ ముచ్చటగా తయారు చేశారు. గోడలమీద వివిధ నాట్యభంగిమలతో వున్న చిత్తరువుల్ని తగిలించారు. నాట్య ప్రదేశానికి వెనుకగా పాలరాయితో మలచిన నటరాజ విగ్రహం ముందు వాయిద్యాల నన్నిటినీ అర్ధ చంద్రా

యువ

కారంలో అమర్చారు. నాట్యప్రదేశానికి ఎదురుగా నెమలి ఆకారంలోవున్న సింహాసనాన్ని వుంచారు. ఆసనం ముందు పళ్లెంలో వివిధ ఫలాల్ని అమర్చారు.

శయనాగారంలో హంసతూలికాతల్పం పై మల్లిపూవులు చల్లారు. అగరు ధూపాన్ని వేశారు. అర్ధనగ్నంగా మలచబడిన శిల్పాల్ని, చిత్తరవుల్ని అమర్చారు.

మంజరి ఆ ఏర్పాట్లుచూసి సంతృప్తి చెందింది. సుభాషిణితో, "యువరాజు శయనాగారంలో ప్రవేశించగానే మలయ మారుత రాగంలో మురళిని తగ్గుస్వరంలో ఆలాపించమని వాద్యగత్తెల్ని ఆదేశించు." అని చెప్పి పంపింది. ఇంతలో వీధిలో కలకలం వినిపించింది.

గవాక్షం దగ్గరకువెళ్ళి చూసింది మంజరి. తన భవనంముందు తన దర్శన భాగ్యంకోసం మూగిన జనం కనిపించారు. ఇది మామూలే. ఎవరో తను గవాక్షం దగ్గర వున్నట్లు గమనించారు కాబోలు చప్పట్లు చరుస్తూ తనని చూపించారు. మంజరి గర్వంగా నవ్వుకుంది. తన సౌందర్యమహిమ అలాంటిది. సాధారణ ప్రజానీకానికి దూరమైన సౌఖ్యాల్ని తాను ఎన్నో అనుభవిస్తూంది. ర్యాజాని కంతటికీ అధినేతలై ప్రజలను పాలించే ప్రభువులు సైతం తనకు దాసులే. యుద్ధంలో అపజయ మెరుగని పరాక్రమ వంతులు తన క్రీగంటి చూపులకు దాసోహమని తమ సర్వస్వాన్ని తన పాదాల ముందుంచారు. విదేశాలతో వాణిజ్యం జరిపే వర్తకశ్రేష్ఠులు తనకు అత్యంత విలువైన ఆభరణాలు కానుకలుగా సమర్పించుకున్నారు. కవీశ్వరులు కలలు కనే కవితావస్తువు తను. కళాకారుల మనసులు కరిగించి కళగా ప్రవహింపచేసే ఆ దేశం తను. దర్శనభాగ్యంతో తన్మయ మందే లక్షలాది ప్రజల ఆరాధ్య దైవం తను.

మందహాసంతో వారికి అంజలి ఘటించింది. ఇంతలో ఒక సౌందర్యరాశి తట్టలో ఒక కుష్ఠురోగిని కూర్చోబెట్టి నెత్తిమీద బెట్టుకుని నడుస్తూవస్తోంది. వీధిలో జనం చెల్లాచెదరై చీదరంతో ఆ స్త్రీని దూషిస్తున్నారు. ఆ కుష్ఠురోగిని ఈ వీధిగుండా తీసుకురావద్దు అని హెచ్చరిస్తూ రాళ్ళు రువ్వుతున్నారు. ఆ స్త్రీ భారంగా అడుగులేస్తూ రాళ్ళు వేయవద్దనీ, తను తొందరగా వెళ్ళిపోతాననీ తిరిగి అటు రాననీ నచ్చచెపుతోంది. రాళ్లు తనపై విసరమనీ తట్టలోని రోగిపై వేయ వద్దనీ వారిని ప్రాధేయపడుతోంది.

మంజరి ఆశ్చర్యచకితయై సుభాషిణిని పిలిచి "ఆ కుష్ఠురోగి ఎవరు?" అని ప్రశ్నించింది.

సుభాషిని పరిశీలనగా కిటికీలోంచి చూసి "అతను తెలీదా, దేవీ! మొన్న మొన్నటివరకూ మీ పాదాలవద్ద దాసానుదాసుడిగా పడివుండిన కౌశికుడు. ఆస్తి అంతా హారతికర్పూరంలా కరిగి

పోయింది. పైగా భయంకరమైన కుష్ఠు వ్యాధి సంప్రాప్తించింది. ఇదీ అతని ఇప్పటిస్థితి'' అంది.

"కౌశికుడా! గుర్తుపట్టలేనంతగా మారి పోయాడే. అవును. ఆ రోగం అంత భయంకరమైనది. అయినా కౌశికుడికి అంత పెద్ద కూతురు వున్నదని నేను విన లేదే.''

''ఆమె అతని కూతురు కాదు, దేవీ. అతని భార్య. పేరు సుమతి. మహా పతి వ్రత. నదీ స్నానం చేయించి యింటికి తీసుకు వెళ్తోంది'' అంది సుభాషిణి.

"అతని భార్యా!'' ఆశ్చర్యంగా అడి గింది మంజరి. కౌశికుడు మంజరికి బాగా తెలుసు. మంజరి సాన్నిహిత్యం కోసం అర్రులు చాచి నిత్యమూ తన సన్ని ధానంలో పడివుంటూ ఆ స్తినంతటినీ అర్పించుకున్నాడు. అతనిదగ్గర ఏమీలేదని తెలియగానే అతన్ని పంపి వేసింది. తిరిగి రావద్దని తను చెప్పినపుడు అతనెంత ప్రాధేయపడ్డాడో, తనని ఎంతగా ప్రేమి స్తున్నానని విన్నవించుకున్నాడో, ఎంత

దీనంగా తనని బతిమాలుకున్నాడో తనకి బాగా జ్ఞాపకంవుంది.

కానీ అతని కింత అందమైన భార్య వుందని తనకి తెలియదు. తన దగ్గరకు వచ్చేవాళ్ళందరికీ అందమైన భార్య లుండ రని కాదు. కాని ఈ సమాజంలో వేశ్యల్ని పోషించడం, అనుభవించడం ఒక ప్రతిష్ఠగా భావించబడే విషయం. కానీ ఈ కౌశికుడు ఒక దేశానికి రాజు కాదు. యుద్ధంలో శత్రురాజ్యాల్ని కొల్లగొట్టి డబ్బు చేసుకునే వీరుడూకాదు. వ్యాపారంలో లక్షలార్జించే వర్తక శ్రేష్ఠికాదు. అతని అంతస్థు వేశ్యల్ని పోషించేదికాదు. అయినా ఎందుకో అంత అందమైన భార్యని నిర్లక్ష్యం చేసి యీ దారుణ కామ ప్రవృత్తిలో అంత భయంకరమైన కుష్ఠ వ్యాధిని తెచ్చుకునేటంతగా మునిగి పోయాడు. మంజరి ఆశ్చర్యంలో మునిగి పోయింది.

సుమతి ఎంత గొప్పవ్యక్తి! ఇన్ని భోగ భాగ్యాలనుభవిస్తున్న తను దేశం లోని మహామహులను తన పాదాలదగ్గర మోకరింప చేయకల్గిన తను ఆమెలో వున్న విశిష్టతను ఎప్పుడూ ప్రకటింపలేక పోయింది. అంతటి భయంకరమైన రోగంతో అంతటి హీనస్థితిలోవున్న కౌశికుణ్ణి అంతగా ఆదరించటం తనకి సాధ్యమా? తనకేకాదు అటువంటి స్థితిలో వున్న ఏ వ్యక్తియొక్క భార్యకైనా అది సాధ్యమా? ఎంతటి దయార్ద్రహృదయం! కదలలేని స్థితిలోవున్న వ్యక్తిని, స్పృశించ డానికికూడ భయపడాల్సిన వ్యక్తిని తట్టలో మోసుకొని నదీ స్నానానికి తీసుకు వెళ్ళడం ఎంత గొప్ప విషయం! మంజరికి, యీ దురదృష్టంలో తనకీ కొంత భాగం వున్నట్టు అనిపించింది. ఆ దంపతులకు ఏదైనా కొంత ధనరూపంలో సాయం చెయ్యగల్గడం ఒక్కటే విముక్తి మార్గంగా తోచింది.

* * *

సుమతి ఇంట్లోకి ప్రవేశించింది. కౌశికుణ్ణి మంచంమీద పడుకోబెట్టింది. కౌశికుడు బాధగా మూలిగాడు. అతని వంటినిండా వ్రణాలు. రక్తం కారుతున్నాయి. ఈగలు ముసురుతున్నాయి. అతని శరీరానికి మానవాకారం పూర్తిగా మాసిపోయింది. పోగుపడిన మాంసం ముద్దలా వున్నాడతను.

సుమతి నూనెతెచ్చి ఈగలు ముసరకుండా వంటినిండా రాసింది. తెల్లటి గుడ్డలు కాళ్ళకీ చేతులకీ కట్టింది. పాలు తెచ్చి నోటికందించి త్రాగించింది. విసనకర్రతో విసురుతూ విసురుతూ మంచం ప్రక్కనే కూర్చుంది.

"ఇక చాల్లే. నువ్వెళ్ళి నిద్రపో", అన్నాడు కౌశికుడు.

"ఫర్వాలేదు. మీరు నిద్రపోయేంత వరకూ విసరనివ్వండి", అంది సుమతి.

కౌశికుడికి సుమతిని చూస్తే అసహనం, జాలి. తను భర్తగా ఆమెను ఏవిధం

గానూ సుఖపెట్టలేకపోయాడు. భార్యగా సామాన్య స్త్రీ పొందే ఎన్నో ఐహిక సౌఖ్యాలకు ఆమె దూరమైపోయింది. తను ఆరోగ్యంగా వున్న సమయంలో కూడ ఆమె తనవద్దనుండి ఏమీ పొందలేకపోయింది. ఇప్పుడు తను చేసిన పాపకృత్యాలకు ఫలితంగా ఏర్పడిన ఈ దారిద్ర్యాన్ని, ఈ రోగాన్ని, ఈ శల్యావశిష్టమైన వ్యక్తిత్వాన్ని ఆమె సేవించవలసి వస్తోంది. తనెప్పుడూ విసుక్కోదు. ఒక్క చిన్న మాటలోనైనా వ్యతిరేకించి ఎరుగదు. ఇది భరించలేని విషయంగా తోచింది కౌశికుడికి. ఆమె తన ఎదురుగా నిల్చుని తను చెప్పబోయే పనిచెయ్యడం కోసం ఆతృతగా ఎదురుచూడ్డం తనని, ఇంత హీనమైన రోగాన్ని సంతరించుకొన్న తనని, సేవించడంకోసం ఆరాటపడ్డం కౌశికుడికి అసహనాన్ని రేపుతున్నాయి. ఇంతకన్నా తనని అసహ్యించుకొని వదిలేస్తే కొంత మనశ్శాంతి పొందేవాడేమో. తన పాపకృత్యాన్ని నిరంతరం ఎత్తి చూపడానికి, తనెంత నీచుడో ప్రతిక్షణం జ్ఞాపకం చెయ్యడానికి నియోగింపబడ్డ వ్యక్తిగా ఆమె కన్పిస్తోంది.

"నువ్వు నా ఎదురుగా వుండటంకన్న పెద్ద బాధలేదు నాకు. ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. ఇంకా నాలో ఏంగొప్ప విశేషముందని యీ తాపత్రయం అంతా! భర్తగా వుండి నీకు చెయ్యాల్సినదాంట్లో పీసమైనా నిర్వర్తించలేక పోయానే: ఇంకా నా గురించి ఎందుకీ ఆరాటం?" అని బాధగా అరిచాడు కౌశికుడు.

సుమతి ఏం మాట్లాడలేదు. విసురుతూ కూర్చుంది. కౌశికుడికి ఆ విధంగా మాట్లాడటం అలవాటే.

"నేనీ రోగంతో ఇంకెన్నాళ్ళో బ్రతకను. ఇన్నాళ్ళూ నీకేవిధమైన సౌఖ్యమూ కలిగించలేక పోయాను. ఇప్పుడైనా నన్నొదిలి వెళ్ళిపో. నా చివరి క్షణాల్లోనైనా ఓ మంచిపని చేశాననే ఆనందం మిగులుతుంది నాకు. నీకింకా ఎంతో జీవితం ముందు వుంది." అన్నాడు కౌశికుడు.

సుమతి విసురుతూనే సమాధానమిచ్చింది: "మీరు లేకుండా నేనొక్కర్తినీ జీవించటం అసంభవం. మీరు నాకేదీ చేయలేకపోయానన్నారు. నాకు తెల్సినంతవరకూ నా మెళ్ళో మూడు ముళ్ళూ వెయ్యడంకన్న చెయ్యాల్సిన మహోపకారం నాకు వుండదు. మీరు నా భర్త. నా దైవం. నాకున్న ఇహానికీ, పరానికీ మీరే ఆలంబనం. మీరు యీ లోకంలో ఎలాంటి వ్యక్తులైనా, ఏ విధంగా పరిగణింపబడినా, మీరెటువంటి వారైనా, ఎటువంటి పనులుచేసినా నా కర్తవ్యం తరం ఉండకూడదు. మీ వ్యక్తిత్వాన్ని పూజించడం, మీలో దైవాన్ని దర్శించడం నాకు నిర్దేశింపబడిన మార్గం. భారత స్త్రీగా ఇంతకుమించిన పుణ్యాన్ని నేను కోరు

కోవడం లేదు. మీరు నన్ను దూరం చెయ్యకండి. మీ సుఖమే నా సుఖం."

కౌశికుడిలో కోపం రేగిపోయింది. "శ్రీరంగనీతులు వల్లించగలవు. నువ్వు నాకు దూరంగా వుండటమే నాకు సుఖం. నా సుఖాన్ని కోరుకొన్న దానివైతే తక్షణం ఇక్కణ్ణుంచి వెళ్ళిపో", అన్నాడు.

సుమతి మళ్ళా మౌనంగా వూరుకుంది.

కౌశికుడు మళ్ళీ అన్నాడు: "నీదెంత అజ్ఞానం, సుమతీ! నా అంత క్షుద్రుడూ, నీచుడూ అయిన వ్యక్తి మరొకడు వుండడు. నాకు సేవ చెయ్యడమా? ఇంత అవసానదశలో వుంటూ చావబోతున్న నాకు యింకా తీవ్రంగా రగుల్తున్న కోర్కెను వింటే నువ్వు క్షమించగలవా? భార్యగాకాదు, స్త్రీగా!"

సుమతి తలెత్తిచూసింది. "ఏమిటది?"

"చెప్పను. చెప్పడానికే సిగ్గుగావుంది. చాలా క్షుద్రమైన కోరిక. నా కోరిక ఏమిటో నీకు చెప్పకపోయినా, అదెంత క్షుద్రమైనదో ఆలోచించు. నేనే నీస్థితిలో వుంటే నన్ను క్షమించి ఉండేవాణ్ణికాదు."

"చెప్పండి, ఏమిటది? నాకు సాధ్యమైనంతవరకూ ఆ కోరిక తీర్చడానికి ప్రయత్నిస్తాను. దయవుంచి నాకా అవకాశం ఇప్పించండి," సుమతి ప్రాధేయపడింది.

"చెప్పనా? చెపుతాను. నేను చెప్పిన తర్వాతైనా నా మీద అసహ్యంతో నువ్వు నన్నొదిలి పోవడానికి అవకాశం వుంది. చెపుతున్నా విను. నేను చనిపోయే లోపుగా ఒక్కసారి, ఒకే ఒక్కసారి ఆ మదనమంజరిని అనుభవించాలని వుంది."

సుమతి చప్పున లేచింది. "మీ కోరిక నెరవేర్చడానికి అనుమతి ఇవ్వండి. ఇప్పుడే వెళ్తున్నాను," అంటూ కౌశికుని పాదాలకు నమస్కరించి, బయటకు నడిచింది. కౌశికుడు "సుమతీ! సుమతీ!" అని అరుస్తున్నా వినిపించుకోకుండా.

* * *

మదనమంజరి నాట్యశాలలో కూర్చుని వాద్య గత్తెంతో నాట్య ప్రదర్శనలో వాయించవలసిన వాద్యాల గురించి, శ్రుతి గురించి, గీతాల గురించి చర్చిస్తోంది. ఆదేశాలిస్తోంది.

ఇంతలో సుభాషిణి వచ్చి, "దేవీ! మీకోసం కౌశికుని భార్య సుమతి వచ్చింది. ప్రవేశ పెట్టమంటారా? పంపివేయ మంటారా?" అని అడిగింది.

మంజరి దిగ్గున లేచి, "సుమతి? ప్రొద్దున్న మనం వీధిలో చూసిన వ్యక్తే?" అనడిగింది.

"అవునమ్మా! ఆ వ్యక్తే," సుభాషిణి సమాధాన మిచ్చింది.

"వెంటనే మా ఆంతరంగిక మందిరంలో ప్రవేశపెట్టు," అంది మంజరి.

"సరే! కానీ, విదర్భ యువరాజు



వచ్చేవేళ అయింది,'' అంది సుభాషిణి.

''ఫర్వాలేదు. ఆయన్ని కూర్చోబెట్టి చిత్తరువులు చూపిస్తూండు. సుమితీ దేవిని వెంటనే మా ఆంతరంగిక మందిరానికి తీసుకురా,'' అంటూ ఆంతరంగిక మందిరానికి దారి తీసింది మంజరి.

సుమతి రాకలోని అంతరార్థం బోధపడలేదు మంజరికి. పైగా, ఒక పతివ్రత తనలాంటి వేశ్యల గృహాల్లోకి ప్రవేశించడమా? ఇంతకు ముందే ఆమెకు ఏదైనా సాయం చేదామని తను అనుకున్న విషయం జ్ఞాపకానికి వచ్చింది. ఏదైనా సహాయం కోరి రాలేదుకదా?

కౌశికుడు నిరుపేదగా మ్మారినంతవఱకూ అతన్ని ఆశ్రయించి, ఆ తర్వాత తృణీకరించిన మంజరికి అంతటి భయంకరమైన రోగంతోవున్న కౌశికునికి సుమతి సేవ చెయ్యగల్గడం ఒకవిధమైన కనువిప్పుగా తోచింది. అంతటి ఔదార్యాన్నింతవఱకూ తానెఱగదు. తనకన్నా సుమతి అధికురాలనడానికి రుజువేం కావాలి? సుమతి పట్ల ఎనలేని గౌరవం ఏర్పడింది మంజరికి. ఆంతరంగిక మందిరంలో సుమతి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

సుభాషిణి సుమతిని వెంటనే తీసుకు వచ్చింది.

మంజరి సుమతికి ఎదురుగా వెళ్ళి, సాదరంగా ఆహ్వానించి, ఆసనం మీద కూర్చోబెట్టింది.

"మీరు రావడం ఒక అమోఘమైన విషయం. నేనే ఇంతకుముందు మీ దర్శనం చెయ్యాలనుకుంటున్నాను. మీరే వచ్చారు. మీకు నేను చేయగలిగిం దేమైనా వుంటే చెప్పండి."

సుమతి తడబడింది. మంజరి తనని ఎరిగున్నట్లుగా పలకరిస్తోంది. ఇంతకు ముందు ఎప్పుడూ కలుసుకోలేదు."క్షమిం చాలి. మీరు నేనెవరి ననుకుంటున్నారో? నన్ను సుమతి అంటారు."

మంజరి చిరునవ్వు నవ్వింది. "నాకు తెలుసు, దేవీ! మీరు కౌశిక మహా శయుని భార్యా మణి అని నాకు తెలుసు, నేను మిమ్మల్ని చూశాను. నావల్ల మీకు కాగల పనేమిటో శెలవియ్యండి."

సుమతి సుభాషిణి వంక చూసింది. మంజరి సుభాషిణితో వెళ్ళి పొమ్మన్నట్టుగా సంజ్ఞ చేసింది. సుభాషిణి బయటకు నడి చింది.

"ఇంతకుముందు మీరే నన్ను కలుసు కోవాలనుకున్నట్టు చెప్పారు. కారణం తెలుసుకోవచ్చా?" అనడిగింది సుమతి.

"మీమీదున్న గౌరవ భావంతో, దేవీ! ప్రొద్దున్న మీరు కౌశికుని తట్టలో మోసుకు వెళ్తుండడం చూశాను. ఎంతటి మాన వత్వం, ఔదార్యంవుంటే అంతటి సేవా భావం కలుగుతుంది?" అంది మంజరి.

"క్షమించాలి. ఇందులో మానవత్వం ఔదార్యం ఉండాల్సిన అవసరం నాకు కన్పించడం లేదు. ఆయన నా భర్త, ఆయనకి సేవ చెయ్యడమే నా కర్తవ్యం"

మంజరి నవ్వింది. "లోకంలో అందరు భార్యలూ అలాగే ప్రవర్తిస్తు న్నారా, దేవీ? ఎంతమంది తమ భర్తల్ని నిర్లక్ష్యం చేయడంలేదు?"

"నేను పతివ్రతను. పతిని సేవించి ఆరాధించటమే నా వ్రతం."

"నేను అంగీకరిస్తాను. యోగ్యుడూ, ప్రయోజకుడూ అయిన భర్తని సేవించడం భార్యకి కర్తవ్యం కావచ్చు. కాని కుష్ఠు రోగినీ, నిరుపేదనూ, భర్తగా తన బాధ్యతల్ని ఏమాత్రం నిర్వర్తించలేని వాడినీ సేవించడం పాతివ్రత్యంకాదు. మానవత్వం! మీరు భార్యగా సేవచేయడం లేదు. ఒక మనిషిగా చేస్తున్నారు."

"నాభర్త ఎటువంటి వాడైనా కావచ్చు. ఎటువంటి స్థితిలోనైనా ఉండొచ్చు. కానీ ఆయన్ని సేవించడం నాకు నిర్దేశింపబడిన మార్గం. విధి."

మంజరి ఆశ్చర్యంగా చూసింది.

"అయితే మీరు కౌశికునికి సేవలు చెయ్యడం మీ కర్తవ్య నిర్వహణ కోసమా? లేక మానవత్వంతోనా?"

"కర్తవ్య నిర్వహణే" సుమతి దృఢంగా అంది.

"మీరు కౌశికుని ప్రేమిస్తున్నారా? ప్రేమించగలరా?" మంజరి అడిగింది.

సుమతి నవ్వింది.

"మీరు అర్థం లేకుండా అడుగుతున్నారు. నా భర్తని నేను ప్రేమించకుండా ఉంటానా?"

"మీ భర్తగా కాదు. ఒక మనిషిగా."

"నాకు ఇంకేమీ తెలీదు. నాకు తెలిసినది ఒకటే విషయం. ఆయన నన్ను అగ్నిసాక్షిగా వివాహమాడారు. ఆయన కోసం నా జీవితాన్ని అంకితం చేయడం నా బాధ్యత."

"పోనీ యీ విషయం చెప్పండి. కౌశికుడు కాదు. మరో వ్యక్తి వేశ్యా గృహాలలో తిరుగుతూ, ఆస్తిని హరింప జేస్తూ, భార్యని నిర్లక్ష్యం చేస్తూ, ఆఖరికి కుష్ఠువ్యాధిని తెచ్చుకొన్న మరో వ్యక్తిని మీరు ప్రేమించగలరా?"

"నేను నాభర్తని తప్ప ఇంకో వ్యక్తిని గురించి ఆలోచించను."

"పోనీ. మరో స్త్రీ అటువంటి వ్యక్తిని ప్రేమించగలదా?"

"అది నాకనవసరమయిన విషయం."

"మీకు ప్రేమంటే ఏమిటో తెలియదు. జీర్ణించుకు పోయిన సాంప్రదాయం మిమ్మల్ని ప్రేమకు దూరం చేసింది. మీరు మీ భర్తని ప్రేమించటంలేదు. అది నిశ్చయం."

సుమతి మాట్లాడలేదు.

'ఇంకొకటి అడుగుతాను చెప్పండి. మీరు మీ భర్తని ఎప్పుడయినా మందలించారా?"

"నా భర్తని నేను మందలించడమా? మీరు అర్థంలేని ప్రశ్నలు అడుగుతున్నారు. ఆయన్ని మందలించాల్సిన అవసరం నాకు కలగలేదు. కలగదు. ఆయనకు నచ్చిన రీతిలో నేను ప్రవర్తించి ఆయనకు సేవ చెయ్యడమే నాబాధ్యత."

"ఎందుకు?" మంజరి అడిగింది.

"ఎందు కేమిటి? భారత స్త్రీకి మోక్ష సాధన భర్తని సేవించడంలోనే వుంది."

మంజరి తీక్షణంగా చూసింది.

"మిమ్మల్ని ఎందుకు గౌరవించాలో అర్థం కావడంలేదు. మీ భర్త దుర్మార్గుడని మీకు తెలిసివుండాలి. చెడు మార్గాలంటే ఏమిటో, మానవ లోకంలో ఉన్నారు కాబట్టి, మీకు అర్థం అయి ఉంటుంది. మీ భర్త చెడుపనులు చేస్తున్నాడని తెలిసికూడ మీరు మందలించలేదంటే అర్థం ఏమిటి? మీకు ప్రేమంటే ఏమిటో తెలిసుంటే, మీరు మీ భర్తని ప్రేమించి వుంటే, ఆయన్ని తప్పక మందలించి వుండేవారు. మీరు ఆయన్ని మందలించ లేదు సరిగదా ఆయన చేసే ప్రతి పనినీ, అడ్డగించకపోవడం, పరోక్షంగా ప్రోత్సహించడమే. అయితే ఆయన చేసే ప్రతి చెడుపనిలోనూ మీకు భాగం ఉన్నదన్న మాట. భార్యగా ఆయన్ని సన్మార్గంలో పెట్టడం గొప్ప విషయమా? లేక ఆయన్ని ఇష్టంవచ్చిన రీతిలో సంచరించ నివ్వడం, పైగా ఆయనకి కించిత్తయినా కోపం తెప్పించకుండా సేవలు చెయ్యడం,

గొప్ప విషయమా? ఏది భార్యగా మీ ధర్మం?"

సుమతి మాట్లాడలేదు.

"మీరు మొదట్లో అయన్ని మందలించి వుంటే ఆయన యీ స్థితికి దిగజారి ఉండే వాడు కాడు. ఆయన చేసే ప్రతిపనికీ మీరు కిమ్మనకుండా కూర్చుంటే ఆయన చెడుపనులు చేస్తే మాత్రం తప్పేమిటి? భార్యగా మీకుండే హక్కులేమీ పొంద లేకపోయారు సరికదా ఆయన తన బాధ్య తలు నిర్వర్తించకుండా వ్యసనాలలోనూ చెడు మార్గాలలోనూ జారిపోయే ప్రమా దాన్ని కల్పించారు. ఆయన సౌఖ్యాన్నీ ఉన్నతినీ మీరు కాంక్షించి ఉంటే ఆయన్ని అదుపులో పెట్టి వుండేవారు."

"ఆయన ప్రవర్తనని నిరోధించటం నా ధర్మం కాదు. ఆయన్ని అనుసరించ డమే నా ధర్మం. భార్య భర్తని అదుపులో పెట్టడం ఏమిటో నా కర్థం కావటం లేదు. అది అసహజం. పైగా భార్య చెపితే భర్త వినాలని ఎక్కడ వుంది?"

"వినకపోతే ఆయన ఖర్మ. సంసా రంలో ఎవరు తప్పు త్రోవ తొక్కినా ఇద్దరూ ఫలితాన్ననుభవిస్తారు. అందుచేత ఒకళ్ళ నొకళ్ళు సరిదిద్దుకునే అవసరం ఎప్పుడూవుంది. మీరు చెప్పినా ఆయన వినకపోతే అందులో మీ తప్పు లేదు. ఇంత నీచంగా, క్షుద్రంగా వేశ్యాలాలసలో పడి దరిద్రుడయి కుష్ఠు రోగాన్ని తెచ్చు కొన్నవ్యక్తిని మానవత్వం విషయం వది లేయండి. భార్యగా మీ రెందుకు గౌరవిం చాలి? బాధ్యతల్ని విస్మరించి యింత దౌర్భాగ్య స్థితిలోకి దిగజారిన వ్యక్తిని మీరు నిర్లక్ష్యం చేసినా తప్పేమిటి? మీకో జీవితంవుంది. అది అనుభవించే హక్కు, బాధ్యత మీవి. ఇంకొక నీచుడి కోసం దాన్ని బలిపెట్టడం దేనికి?"

సుమతి చటుక్కున చెవులు మూసు కుంది.

"శివ శివా! మీరు దయవుంచి అటు వంటి మాటలు మాట్లాడకండి. నా భర్తని దూషించడం నేను సహించలేను."

మంజరి ఛీత్కారంగా అంది: "నేను మిమ్మల్ని గౌరవించాను. మీ భర్తని గౌర వించలేదు. ఇప్పుడు మిమ్మల్ని గూడ గౌరవించటం లేదు. ఇంతవరకూ కౌశికుడు ఎంతటి ధూర్తుడో అనుకున్నాను. కాని అతన్ని ధూర్తుణ్ణిచేసింది మీరు. మిమ్మల్ని అసహ్యించుకోవాలి."

సుమతి ఏం మాట్లాడలేదు.

"ఇందాక అన్నారు. 'భారత స్త్రీకి భర్తని సేవించడంలోనే మోక్షసాధన వుంది అని. మీ రెంతటి నీచులో ఇంకా వేరే చెప్పాలా? మీరు మీ భర్తని ప్రేమించ లేదు. భార్యగా అతన్ని సముదాయించి, మంచి మార్గంలో పెట్టే ప్రయత్నంచేయ లేదు. అతను క్షుద్రమార్గాన్ని అనుసరించ డానికి పరోక్షంగా సాయం చేశారు. ఇప్పుడు కుష్ఠురోగంతో స్పృశించడానికి కూడ భయపడే వ్యక్తికి మీరు సేవలు



చేస్తున్నారు. ఎందుకు? మీ స్వార్థం. మోక్షసాధనకోసం మీరు పొందే ఆరాటం. అతన్ని భర్తగా మీరు చూడట్లేదు. మీ మోక్షసాధన కోసం పనికి వచ్చే పనిముట్టుగా మాత్రమే! ఇదెక్కడి పాతివ్రత్యమో అర్థంకావటంలేదు."

"పతివ్రతల్ని మన శాస్త్రాలు, సమాజం, సంప్రదాయాలు ఎప్పుడూ గౌరవిస్తూనే వున్నాయి. మీరు కాదన్నంత మాత్రాన పాతివ్రత్యపు విలువ తగ్గదు." అంది శాంతంగా సుమతి.

"మీరు అనుసరిస్తున్నది పాతివ్రత్యమే అయితే అటువంటి పాతివ్రత్యాన్ని పాతేయడానికి ఎన్ని శాస్త్రాలు, సమాజాలు, సాంప్రదాయాలు అడ్డొచ్చినా నాకు భయంలేదు. నేను వేశ్యను. సాంసారిక సౌఖ్యాలు నాకు కరువయ్యాయని నేను బాధపడతాను. భార్యాభర్తల మధ్య ప్రేమ ఎలావుంటుందో నాకు తెలీదు. కానీ భార్యగా కర్తవ్యాలన్నిటిగమ్యం మోక్షసాధనే అయితే, అటువంటి భార్యాత్వం కన్న యీ వేశ్యావృత్తి మేలు. ఇంత వరకూ మీరు నాకన్నా గొప్పవాళ్ళని అనుకున్నాను. ఇప్పుడు చెపుతున్నాను. మీకన్నా అధములుండరు. మీకన్నా నేను లక్షరెట్లు అధికురాల్ని!" మంజరి ఆవేశంతో

అరిచింది. "మీతో మాట్లాడ్డానికి నాకు సహనం పోతోంది! మీరెందుకొచ్చారు?"

"అవసాన దశలో నా భర్త ఒక్క కోరిక కోరాడు. అందుకు మీ సహాయం కావాలి."

"ఏమిటది?" అంది మంజరి విసుగ్గా.

సుమతి తలవంచుకునే అంది "చని పోయే ముందు నా భర్తకి ఒక్కసారి మిమ్మల్ని అనుభవించాలని ఉందిట. మీ అనుమతికోసం వచ్చాను. మిమ్మల్ని బ్రతిమాలుకుంటున్నాను."

మంజరి ఛీత్కారంతో బిగ్గరగా అరి చింది: "ఛీ! పాపీ! నువ్వు తక్షణం యిక్కడ నుంచి వెళ్ళిపో. లేకపోతే గెంటిస్తాను."

సుమతి మెల్లగా లేచి వెళ్ళిపోయింది.

మంజరి మ్రాన్పడిపోయింది. ఎంత దారుణమయిన కోరిక! ఒక కుష్ఠురోగిని అనుభవించనిమ్మని అడగడానికివచ్చిందా? సాటి స్త్రీగా అయినా ఆలోచించలేక పోయిందా? ఇదేమి పాతివ్రత్యం? ఇటు వంటి క్షుద్రురాల్ని క్షమించవచ్చా?

మంజరికి సుమతిపై అసహ్యం కలి గింది. వడి వడిగా వెళ్ళి సుమతిని చప్పట్లు చరిచి పిలిచింది. సుమతి ఆతృతగా వచ్చింది.

"నీచురాలా! నీ మోక్షసాధన నిన్ని దౌర్భాగ్యస్థితికి తీసుకు వచ్చిందా? భర్తల్ని వేశ్యా గృహాలకి భార్యలే పంపించడం పాతివ్రత్యం కాబోలు. తీసుకురా అతన్ని అతని కోరిక చెల్లిస్తాను. అందువల్ల నా కారోగం సంప్రాప్తమై, ఇందరిచే ఆరా ధింపబడిన నా సౌందర్యం నాశనమై అతి హేయమైన కుష్ఠురోగపు వికారాన్ని వైక ల్యాన్ని సంతరించుకొన్నా సరే, నా వృత్తినీ, యీ భోగభాగ్యాల్నీ, సంఘంలో నా గౌరవాన్నీ వదులుకోవాలన్నా సరే నేను సిద్ధమే. కాని యిందుకు బదులుగా నిన్నూ నీ మూఢ పాతివ్రత్యాన్నీ అవమా నించే అవకాశం నాకుంటే చాలు. ఎల్లాంటి అవమానమో తెలుసా? రోజూ నువ్వు నా యింట్లో దాసీగా సపర్యలు చేయాలి. నే నెవర్ని? క్షుద్రమైన వేశ్యను. నువ్వు? పాతివ్రత్యంతో మోక్షాన్ని సాధించుకో బోయే స్త్రీవి. నువ్వు నా యింట్లో దాసీగా ప్రవర్తించాలి. తెలిసిందా? దేశంలోని పతివ్రతల నందరినీ ఈవిధంగా అవమా నించే మహద్భాగ్యం దక్కితే ఆ కుష్ఠు రోగేకాదు యింకా ఎవ్వరైనా వుంటే తీసుకురా. నా కభ్యంతరం లేదు. నా అందం, యవ్వనం, ప్రతిష్ఠ, ఈ భోగ భాగ్యాలుపోయినా ఫర్వాలేదు. వెళ్లు! కానీ తెలుసుకో! పతివ్రత అనే పదం కంటె నీచమైనది మరొకటి లేదు." అని అరిచింది.

సుమతి ఆనందంతో, ఆతృతతో మంజరికి నమస్కరించి వడివడిగా వెళ్ళి పోయింది.